# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు





# -33-

## అమెరి' కోతికి కొబ్బరి కాయ'

**గత నెలలో** ...అంటే సెప్టెంబర్ 22, 2019 నాడు మా ఊళ్లో ఒక కోతీ కొబ్బరికాయా ఆటల పోటీ జరిగింది. కాదు, కాదు రెండు కోతులూ, రెండు కొబ్బరి కాయలూ అనాలి. "ఓయ్ ముగుడు గారూ, కాస్త జాగ్రతగా మాట్లాడు. ఎవర్ని కోతి అంటున్నావ్?" అని ఎడం చేతి చూపుడు వేలు యమ స్పీడుగా ఆడిస్తూ నా కేసి చూపించింది మా క్వీన్ విక్టోరియా. ఆవిడది ఎప్పుడూ ఆ తెల్ల కోతి పార్టీయే. నేనైతే ఆ ఇద్దరిలో ఎవరి పార్టీ కాదు. నెను ఎప్పుడో నెహ్రూ గారి దగ్గరా, కెన్నెడీ దగ్గరే ఆగిపోయాను. ఇండియా ప్రధాన మంత్రి అంటే అలా ఉండాలి. అమెరికా అధ్యక్షుడు అంటే అలా ఉండాలి. కానీ అప్పటికీ ఇప్పటికీ కొన్ని పోలికలు ఉన్నాయి. నెహ్రూ గారికి పాపం భార్య లేదు. మోదీ గారికి సతీమణి ఉందిట కానీ ఎక్కడ ఉందో ఎవరికీ తెలీదు. అంచేత అది సేమ్ టు సేమ్. ఇక కెన్నెడీ గారికీ, ట్రంపు గారికీ ఉన్న సాపత్యం అల్లా అందమైన భార్యలు ఉండడమే....అవును..భార్యలు అనగా ఆలు బహువచనమే. ఇద్దరికీ ఒకరు కాదు, అనధికారికంగా ఉన్న వాళ్ళ లెక్క వాళ్ళకే తెలీదు. అంటే ట్రంప్, కెన్నెడీ సేమ్ టు సేమ్...

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే...1985 లో హ్యూస్టన్ కి వచ్చిన మొట్టమొదటి భారత ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ సమావేశానికి నాతో సహా సుమారు ఐదు వందల మంది రాగానే మేము చరిత్ర సృష్టించాం అని సంబర పడిపోయాం. అలాగే 1994 లో పి.వి. నరసింహా రావు గారు వచ్చినప్పుడు ఆయన చేత మా మీనాక్షీ దేవాలయంలో చెట్టు కూడా నాటించి మరొక సారి చరిత్ర సృష్టించాం. ఇప్పుడు అ చెట్టు ఎండి పోయింది. ఆ రెండు చరిత్రలూ ఎవరికీ గుర్తు లేవు. కానీ మొన్న సెప్టెంబర్ 22, 2019 నాడు మన మోదీ గారూ, మా ట్రంప్ గారూ రావడం, ఏకంగా మాతో సహా యాభై వేల మంది పైగా మూడు గంటల సేపు చీమ చిటుక్కుమన్నా వినపడేటంత నిశ్శబ్దంగా, ఎక్కడా గొడవ చెయ్యకుండా బుద్ధిగా కూచోడం కూడా చరిత్ర సృష్టించడమే కానీ, నాకు అలా దిష్టి కొట్టడం ఇష్టం లేదు. ఏమో. ఈ పుట్టలో ఏ పాము ఉందో. ఇది వరకటిలా కాకుండా ఈ సారి నిజంగానే ఈ సమావేశం కలకాలం నిలబడుతుందేమో! ఏమో గుర్రం ఎగరా వచ్చు. ట్రంప్ మళ్ళీ నెగ్గా వచ్చు.



అదిగో, ఆ నెగ్గడానికే సదరు ట్రంప్ మహాశయుడు వైట్ హౌస్ అనే

కైలాస పర్వతం దిగి మా ఊరు వచ్చి "హౌడీ, మోడీ" అన్నారు. నిజానికి ఆయనకి కావలసినది మోడీ కాదు, వినడానికి ఆయన వాగ్ధాటీ కాదు. ఆయనకి కావలసినది తన వాగ్ధాటి వినే ఆ యాభై వేల మంది పవిత్ర భారతీయులు, తద్వారా యావత్ అమెరికాలో ఉన్న వారి వోట్లు, మరియు తన ఎలెక్షన్ కోసం భారీ విరాళాలు. అహ..ఇదే ట్రంప్ గారు కేవలం ఎన్నారైల కోసం విడిగా ఒక బహిరంగ సభ పెడితే మా ఉగాదికి వచ్చినంత మంది కూడా రారేమో? వచ్చినా, మా గ్రీన్ కార్డ్ ల సంగతి ఏమిట్రా?, మా హెచ్ వన్ బి కోటా పెంచే సంగతి ఏమన్నాతేల్చావా? అని తగులుకోరూ? ఇప్పుడైతే అవన్నీ మోదీ గారి జుబ్బా వెనకాల దాచేసి పబ్బం గడుపుకునే అవకాశం కదా! ఇక మోదీ గారి విషయానికే వస్తే ఆయనకి నిజంగానే కోతికి కొబ్బరి కాయ దొరికినట్టు అయింది. లేక పోతే అమెరికా అధ్యక్షుల వారి ధర్మమా అని కొన్ని వందల తెలుపు, నలుపు సెక్యూరిటీ వాళ్ళు ఆయన చుట్టూ ఉండే వారా? ఆయన ఒక్కడి సభా అయితే ఏదో శాస్త్రానికి అరడజను స్థానికి పోలీసు వాళ్ళతో ఆయన సెక్యూరిటీ తతంగం జరిగిపోయేది కదా! ట్రంప్ గారిని చూడడానికి శ్వేత సౌధం ముందు కాపలా కాయ వలసిన అవసరం లేకుండా, ఆయనే దిగి రావడం అంటే అంతా తన గొప్పతనమే అని మోదీ గారు అనుకోవడంలో తప్పు లేదు కదా!

మోడీ గారికి హౌడీ చెప్పడానికి సముద్రం లో ఆల్చిప్పల్లా నేనూ, మా క్వీన్ విక్టోరియా మా అబ్బాయి చదువుకున్న హై స్కూల్ దగ్గర నిర్వాహకులు ఏర్పాటు చేసిన బస్సులో వెళ్ళడానికి నిశ్చయించుకున్నాం. అక్కడికి పొద్దున్నే ఏడు గంటలకి నేను నిద్ర మొహం తోటీ, జీవితంలో మొట్ట మొదటి సారి ఒక భారత ప్రధానినీ, ఒక అమెరికా అధ్యక్షుడి నీ, అందునా ఆవిడ ఫేవరెట్ అయిన ట్రంప్ గారినీ చూడడానికి పట్టు చీరా, రవ్వల నెక్లెసూ, వంద కాసుల వడ్డాణం, కాసుల పేరూ వగైరా సింగారాలతొ ఆ స్కూలు దగ్గరకి వెళ్ళగానే నాకు బొత్తిగా తెలియని ముగ్గురు యువకులు "ఎలా ఉన్నారు, రాజు గారూ" అని పలకరించి, వెంటనే బస్సులో ఎక్కించడానికి ప్రయత్నించి, పక్కనే ఉన్న మా తాలూకా మొత్తానికి పోలీస్ చీఫ్ అయిన జాన్ వాటెవర్ చూసిన చూపులు చూసి ఆగారు. ఆగి "ఆయన మా ఊరి పెద్ద" అని ఆ జాన్ పెద్దాయనతో నీరసంగా చెప్పి "రాజు గారూ, మీరు మాకు తెలిసు కానీ, ఈ జాన్ వెధవ పక్కనే ఉన్నాడుగా. ఏమీ అనుకోకుండా మీదీ, మీ క్వీన్ విక్టోరియా గారిదీ డ్రైవర్ లైసెన్స్, వీలుంటే పెళ్ళి ఫొటో చూపించండి. సెక్యూరిటీ చెక్ అనమాట." అన్నారు. పెళ్ళి ఫొటో అనమాట వినగానే మా అంత వరకూ కళ కళ లాడుతున్న మా ఆవిడ మొహం వెల వెల పోగా నేను కేవలం మా 'చోదక అనుమతులు" చూపించి బస్సు ఎక్కాం. అప్పటికే మా రెండు కుర్చీలూ తప్ప మిగతా బస్సు నిండిపోయింది. వెంటనే జాన్ గారు బస్సు ఎక్కి సంతృప్తిగా తల ఊపి, పిస్తోలు జేబులో పెట్టేసుకుని "గుడ్ లక్" అని చెప్పి ఇంటికి వెళ్ళి పోయాడు. ఇక్కడ నా గమనిక ఏమిటంటే నీలం బట్టలు వేసుకున్న అమెరికా పోలీసుని చూస్తే గుండె దడ దడ లాడుతుంది కానీ అదే ఖాకీ బట్టలు వేసుకున్నమన పోలీసు వెంకట స్వామిని చూడగానే నవ్వొస్తుంది. అలా వెంకట స్వామి గుర్తుకొచ్చి నవ్వుకుంటు ఉండగా, మా బస్సు 'చోదకుడు' భారీ నల్ల విగ్రహంతో లేచి నిలబడి, మమ్మల్ని చూసి, బస్సు నిబంధనలు చెప్పి "బస్సు వెనకాల పరిశుభ్రమైన టాయ్ లెట్" ఉంది అని ప్రకటించాడు. వెనువెంటనే బస్సులో ఉన్న సీనియర్ సిటిజెన్స్ ఆనందంతో తప్పట్లు కొట్టడం, ఒకాయన ఠకీమని లేచి అటు వెళ్ళినా మా చోదకుడు ఖచ్చితంగా సమయానికి బయలు దేరాడు. సుమారు నలభై నిముషాల తర్వాత గమ్యస్థానం అయిన NRG స్టేడియం చేరుకున్నాం. ఆ రోడ్లు నేను ఎప్పుడూ కారులో వెళ్ళేవే అయినా, పెద్ద బస్సులో వెళ్తుంటే అమెరికాలో నోరు తెరుచుకుని టూరిస్ట్ లా ప్రయాణం చేస్తున్న భావన కలిగింది. ఇక అక్కడికి వెళ్ళాక రెండు మైళ్ళు నడిచి స్టేడియంలోకి వెళ్ళి మాకు కేటాయించిన కుర్చీలలో కూచోగానే ఎవరో వెనకాల నుంచి నా రెండు భుజాల మీదా చేతులు వేసి కుదిపారు. తీరా చూస్తే ఆయన నా కార్డియాలజిస్ట్....అనగా



హృద్రోగ నిపుణుడు. ఆయన్ని చూడగానే ఎప్పటి లాగా నా గుండె లయ తప్పింది. ఎందుకైనా మంచిది నా వెనకాలే ఆయన్ని కూచోపెట్టడం మోదీ–ట్రంప్ ల కుట్రా లేక నా ఆరోగ్యం మీద వారి బెంగా అని అనుమానం వచ్చింది. అప్పటి వరకూ ఆయన్ని చూడని మా ఆవిడ "భలే బావున్నాడే నీ గుండె డాక్టరూ" అంటూ ఆయన చేతులని తీసేసి తన చేతులు నా భుజం మీద వేయగానే నా గుండె లయ తప్పడం మాట దేవుడెరుగు, పూర్తిగా ఆగిపోయింది. కానీ మా డాక్టర్ పక్కనే నేను ఎప్పుడూ చూడని వాళ్ళవిడ కనపడగానే, అన్నీ సద్దుకుని, ఆ తరవాత మూడు గంటలూ బాగానే మాట్లాడుకున్నాం. కావాలంటే మా ముగ్గురి ఫొటో ఇక్కడ చూడండి.

ఇక సభ మొదలు పెట్టడానికి ముందు గంటన్నర సేపు 400 మంది హ్యూస్టన్ కళాకారులు సాంస్కృతిక కార్యక్రమం చేశారు. అహింసావాది అయిన గాంధీ గారి 150వ జయంతి జరుగుతూ, ఆయన్ని పదే పదే స్మరించుకుంటున్న ఈ సందర్భం లో ఇంతసేపు ఆ 'హింసా' కార్యక్రమం జరిగినా, దానికి ఈలలు వేసి గొడవ చేయకుండా భరించిన యాభై వేల మంది సహనాన్ని మెచ్చుకోవాలి. ఏదో శాస్త్రానికి పంజాబీ వారి భాంగ్రా, ఒడిశా  వారి కథక్ లాంటివి ఉన్నా సంప్రదాయం తక్కువా, బాలీవుడ్ తరహా రికార్డింగ్ నృత్యాలు, పాటలూ ఎక్కువా, ఉన్న ఈ గంటన్నర కార్యక్రమం నాకు ఎందుకో అంత రుచించలేదు. లేకపోతే తెలుగు సంప్రదాయానికి "పక్కా లోకల్" పాట కంటే ఇంకేమీ దొరకలేదా? అంత కంటే మన సినీ సంప్రదాయాన్ని ప్రతిబింబించడానికి "కెవ్వు కేక", మూడొస్తే ముద్దొస్తా" లాంటివి ఉన్నాయి కదా! అయితే పెద్ద బెంగ లేదు. ఎందుకంటే ఇంచు మించు అన్ని వేల మందీ మోదీ జపతపాలతోటీ, కేవలం మా ఆవిడ ఒక్కర్తే  ఏక ముఖ రుద్రాక్షతో ట్రంప్ జపంతో బిజీగా ఉండడంతోటీ, సెల్ఫీల తోటీ సరిపోయింది. డెమొక్రాటిక్, రిపబ్లికన్ రాజకీయ పార్టీ లకి చెందిన చాలా మంది అమెరికా లోక్ సభ, రాజ్య సభల సభ్యులు ఆ గెంతులన్నీ అయ్యాకే వేదిక మీదకి రావడం, మోదీ గారు హుందాగానే రంగ ప్రవేశం చేసి అందరికీ కరచాలనం చేసి, కొందరి ప్రసంగాలు వింటున్నట్టే కనిపించినా చీటికీ, మాటికీ చేతి వాచీ చూసుకుంటూ, స్టేజ్ వెనకాల సైడ్ వింగ్ కేసి కూడా దృష్టి సారించడం బహుశా నేను మాత్రమే అది గమనించి ఉంటాను. మోదీ గారు అలా కంగారు పడడానికి కారణం అప్పటికే మా ట్రంప్ గారి విమానం హ్యూస్టన్ లో దిగింది కానీ ఆయన ఐపూ, గియిపూ తెలియదు. తీరా ఆ ఆయన ఈ సభకి రాలేక పోతే తను ఎంతో కష్ట పడి బట్టీ పట్టిన ప్రసంగం మార్చుకోవాలేమో అని మోదీ గారి బెంగ. అసలు జరిగిన విషయం ఏమిటంటే సరిగ్గా అప్పటికి నాలుగైదు రోజుల ముందే మా హ్యూస్టన్ వరదల్లో మునిగి పోయింది. ఆంధ్రాలో అయితే జగన్ గారు వెళ్ళక పోయినా, చంద్రబాబు వరదలయ్యాక తాపీగా వెళ్ళి "ఈ వరదలని మేము చూస్తూ ఊరుకునేది లేదు. దానికి కారకుడైన జగన్ తాట తీస్తాం" అని ప్రకటించారు. ఇక్కడ ఆ పప్పులు ఉడకవు. వరదల తర్వాత హ్యూస్టన్ వచ్చిన ట్రంప్ గారు తిన్నగా మోదీ సభకి వెళ్తే అందరూ ఆయన తాట తీస్తారు. అంచేత ఆయన వరదలలో వచ్చిన నష్టాల మీద అధికారిక సమావేశం స్థానిక అధికారులతో పెట్టుకుని, అది అయ్యాక, ఒక ప్రకటన చేశాక, మోదీ సభకి వస్తే తన తాట ఎవరూ తియ్య లేరు కదా అని ప్లాన్ అనమాట. పాపం, ఈ వరదల సంగతీ, ఈ అత్యవసర మీటింగ్ సంగతీ మోదీ గారికి తెలియక బెంగ పడిపోయి చేతి వాచీ తెగ చూసేసుకున్నారు అనేది నా ప్రతిపాదన.



తీరా ట్రంప్ గారు వచ్చారు అని గుప్పుమని తెర వెనక పొగ రాగానే, ఈ సెనెటర్లనీ, కాంగ్రెస్ మెన్ లనీ, మా మేయరు గారినీ గభాల్న వేదిక నించి దింపేసి ప్రధాని మోదీ అధ్యక్షుడు ట్రంప్ గారిని వేదిక మీదకి ఆహ్వానించి, తనదే అయిన పద్ధతిలో కావిలించుకుని ఉబ్బి తబ్బిబ్బు అయ్యారు. ఇలాంటిది ఇది వరలోనే కొంచెం ప్రాక్టీస్ ఉంది కాబట్టి ఈ సారి ట్రంప్ గారు అన్నింటికీ సిద్ధపడి, తన వంతు మోదీ గారి నడుం మీద చెయ్యి వేద్దాం అనుకోగా ఇద్దరికీ ఉన్న ఎత్తు పల్లాల తేడా వలన ట్రంప్ గారి చేతులు మోదీ గారి పీకకి చుట్టుకోబోయాయి. ఆ ఉడుం పట్టునుంచి మోదీ గారు లాఘవంగా తప్పుకుని మైకు ముందుకి వెళ్ళిపోగా ట్రంప్ గారు నాలుగడుగుల దూరం లో 'రాముడు మంచి బాలుడు"లా నుంచున్నారు. ట్రంప్ గారు రాగానే డెమోక్రాటిక్ పార్టీ శాసన సభ సభ్యులు అందరూ వాక్ ఔట్ చేశారు.

ఇక మోదీ గారు తన సహజ సిద్ధమైన గుజరాతీ ఇంగ్లీషులో అరగంట సేపు ట్రంప్ గారిని ఈ నాటి అనాగరిక భాషలో చెప్పాలంటే తెగ 'గోకారు" ..అనగా పొగిడారు. ఇక్కడ ట్రంప్ గారి తెలివి తేటలని మెచ్చుకోవాలి. అంటే ఆయన ఎంత చెవులు నిక్కబొడుచుకుని విన్నా మోదీ గారు ఏమంటున్నారో ఖచ్చితంగా తెలియక పోయినా, యాభై వేల మంది ఎప్పుడు తప్పట్లు కొట్టినా దాన్నిని ఒక సూచనగా భావించి ఆయన కూడా తల ఊపుతూ తప్పట్లు కొడుతూ మోదీ గారికి మరింత ఆవేశానందాలు కలిగించారు. ఇక తన వంతు వచ్చే సమయానికి పాపం ప్రధాన మంత్రిని మొదటి వరసలో కూచోమని వేదిక మీద నుంచి క్రిందకి దింపేసి ఆయన మోదీ గారిని పొగిడే కార్యక్రమం మధ్యే మధ్యే చేసినా, ఆ గంట సేపూ "స్వ గోకుడు" ..అనగా తన ప్రభుత్వాన్ని తనే పొగుడుకుంటూ, తన నాయకత్వంలో ఎన్ని గొప్ప పనులు చేసిందో, మన ఎన్నారైలు ఎంత గొప్ప వారో వారి మీద తనకెంత గౌరవం ఉందో వచ్చే ఏడు జరగబోయే ఎన్నికల ప్రచార ప్రసంగం చేశారు. ఆ పిమ్మట మళ్ళీ కుర్చీలు మార్చుకుని, అంటే మోదీ గారు వేదిక మీదా, ట్రంప్ గారు మోదీ గారి మాజీ కుర్చీలోనూ కూచోగా, ఈ సారి మోదీ గారు తన సహజ సిద్ధమైన గుజరాతీ హిందీ లో గంటన్నర కి పైగా ఉపన్యసించారు. ఈ ఉపన్యాసం లో ఆయన తన హయాంలో కట్టించిన వంద మిలియన్ల టాయ లెట్ల గురించి సగర్వంగా ప్రకటించినప్పుడు అంతటి మేరా భారత్ మహాన్ కి తప్పట్లు కొట్టవచ్చో, కొట్టకూడదో తెలియక పాపం ఉన్న దానికన్నా ఎక్కువ తెల్ల మొహం పెట్టి పాలిపోయారు. ఆయా ప్రసంగాల పూర్తి పాఠాలు అన్ని పేపర్లలోనూ, టీవీలలోనూ వచ్చాయి కాబట్టి నేను వాటి జోలికి పోనే పోను.




ఇక నా దాకా వచ్చిన తెర వెనుక భాగోతాలు చాలానే ఉన్నాయి. ఉదాహరణకి హ్యూస్టన్ లో ఉన్న బీద ఇండియా వార్తా పత్రికల వారికి ఎనిమిదో అంతస్తులో చిన్న గదీ, రెండు టీవీలూ ఏర్పాటు చేసి, కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశాన్ని అమెరికా టీవీ, పత్రికల వారికి మాత్రమే ఇచ్చినట్టు అదోలా మొహం పెట్టుకున్న ఒకానొక పత్రికాధిపతి నాకు కనపడి వాపోయాడు. అలాగే మోదీ గారితో ఫోటో

అవకాశాలు ఆయనకి గుజరాతీ హల్వా చేసిన రెస్టారెంట్ వారికీ, వారి స్నేహితు తో పాటు భారీ విరాళాలు ఇచ్చిన వారికీ, అసమదీయులకీ మాత్రమే అందుబాటులో ఉన్నాయి అని అనుకున్నా, అందులో ఉన్న ఇబ్బందులు తెలిసిన వాడిగా నేను అలాంటివి పట్టించుకోను.

ఏది ఏమైతేనేం, మొత్తానికి హౌడీ మోడీ కార్యక్రమానికి ట్రంప్ గారు రావడం, యాభై వేల మందికి పైగా వచ్చిన ఈ మహానాడుకి మా హ్యూస్టన్ లో ఉన్న 600 ఇండియా సంఘాలు టెక్సస్ ఇండియా ఫోరమ్ అనే పేరిట  మొట్టమొదటి సారిగా ఏకతాటి మీదకి వచ్చి, ఎక్కడా ఒక చిన్న ఇబ్బందికరమైన సంఘటనా జరగకుండా, ఐదారు మిలియన్ డాలర్ల ఖర్చుతో జరిపించడం చాలా మెచ్చుకోదగ్గ విషయమే. ఇది చరిత్రలో ఎన్నేళ్ళు నిలబడుతుందో చూద్దాం. ఈ బహిరంగ రాజకీయ సభ మాట ఎలా ఉన్నా, తెర వెనుక ట్రంప్ గారు అనేక వ్యాపారస్థులు, పెట్టుబడిదారులతోనూ, అమెరికా ప్రభుత్వ అధికారులతోనూ జరిపిన చర్చలు ఏ మాత్రం సఫలం అయినా, పవిత్ర భారత దేశానికి మేలు జరుగుతుంది. ఇక గ్రీన్ కార్డ్ ల విషయం లో ఉన్న అనేక మంది హెచ్ వన్ బి వీసా వారు, చిన్న తనంలోనే అమెరికా వచ్చి ఇక్కడే చదువుకున్నా 18 ఏళ్ళు దాటగానే అటు సిటిజెన్ షిప్ కీ, గ్రీన్ కార్డ్ కీ అర్హత కోల్పోవడమో, పాతికేళ్ళకి పైగా వేచి ఉండడమో తెలియక త్రిశంకు స్వర్గం లో కొట్టుమిట్టాడుతున్న వేలాది ఎన్నారై లకి.....వారిలో అధిక సంఖ్యాకులైన తెలుగు వారికి మోదీ –ట్రంప్ సఖ్యత వలన సమస్య తీరితే అంతకంటే కావలసినది ఏముందీ? ఇలాంటి ఉపయోగకరమైన పనులు జరగక పోతే ఈ తతంగం అంతా రెండు కోతులు రెండు కొబ్బరి కాయలతో ఆడుకుంటుంటే మనం వెళ్ళి చూసి తప్పట్లు కొట్టినట్టే!

**COMMENTS**